నేడు ప్రజావాణి కార్యక్రమం

రాజేంద్రనగర్‌: సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉప కమిషనర్‌ రవి కుమార్‌ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీకి సంబంధించిన అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొంటారని వెల్లడించారు. సర్కిల్‌ పరిధిలోని అత్తాపూర్‌, రాజేంద్రనగర్‌, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్‌ డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసి సమస్య పరిష్కారాన్ని పొందాలని కోరారు.

ప్రశంసా పత్రంతో సత్కారం



డాక్టర్‌ వేము వందనంను సత్కరిస్తున్న నిర్వాహకులు

రాజేంద్రనగర్‌: రవీంద్ర భారతి మినీ హాల్‌లో ఆదివారం జీవన తత్వ గీత విశ్వజన సంహిత శ్రీమద్భగవద్గీత పుస్తకా విష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో డాక్టర్‌ వేము వందనం పాల్గొని శ్రీ మద్భగవద్గీతపై కవితా పఠనం చేసినందుకు ఆయనకు సాహిత్య వేదిక అధ్యక్షులు డాక్టర్‌ వైరాగ్యం ప్రభాకర్‌, ప్రధాన కార్యదర్శి భవానీలు ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌ అధ్యక్షులుగా నియమించాలి



మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్‌ నాయకులు

అత్తాపూర్‌: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ను గుర్రంపల్లి యాదగిరి గాంధీ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన అత్తాపూర్‌ డివిజన్‌లో చేసిన అభివృద్ధి పనులను, తాను చేసిన ఉద్యమాలను కేటీఆర్‌ దృష్టికి తీసుకువెళ్లాడు. అనంతరం తనకు అత్తాపూర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షులుగా అవకాశం కల్పించాలని గుర్రంపల్లి యాదగిరి కోరారు. ఆయనను కలిసిన వారిలో నరేందర్‌ రెడ్డి, గుర్రంపల్లి రాములు తదితరులున్నారు.

ఆల్‌ కాలనీస్‌ ఫెడరేషన్‌ అధ్యక్షుడిగా డాక్టర్‌ అవినాష్‌



అవినాష్‌ను అధ్యక్షునిగా ఎన్నుకున్న కార్యవర్గ సభ్యులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ఆల్‌ కాలనీస్‌ ఫెడరేషన్‌ అధ్యక్షునిగా డాక్టర్‌ అవినాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో అధ్యక్షునిగా పనిచేసిన సీతారాం రాజీనామా చేయటం, కార్యవర్గ సభ్యులు గత సమావేశంలో ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. 2025 మార్చి వరకు కమిటీ ఎన్నిక సమయం ఉండటంతో అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న 5 మంది ఉపాధ్యక్షులలో నుంచే అధ్యక్షుడిని ఎంపిక చేసేందుకు ఆదివారం హుడా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ప్రస్తుతం ఉపాధ్యక్షునిగా ఉన్న డాక్టర్‌ అవినాష్‌ను అధ్యక్షుడిగా కొనసాగాలని సభ్యులు కోరారు. దీంతో ఆయన అంగీకరించటంతో ఆయనను అధ్యక్షునిగా ఎన్నుకున్నట్టు, ఈనెల 29న నిర్వహించే సర్వసభ్య సమావేశంలో తీర్మాణం చేస్తామని ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం



ఆటో డ్రైవర్లతో సమావేశమైన ప్రదీప్‌ కుమార్‌

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని కాంగ్రెస్‌ పార్టీ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌ అన్నారు. ఆదివారం వట్టినాగులపల్లి గ్రామంలో ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్‌ సౌకర్యం కల్పించటంతో తమకు ఆదాయం తగ్గిందన్నారు. తమకు నెలకు ఇంత మొత్తం ఇచ్చి ఆదుకునేలా చూడాలని కోరారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌ డ్రైవింగ్‌ లైసెన్స్‌లు లేని వారికి వాటిని తమ డబ్బుతో ఉచితంగా ఇప్పిస్తామని, రాబోయే రోజుల్లో ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

యాకుత్‌పురా: వరదనీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ వసీవుద్దీన్‌ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన డివిజన్‌లోని యాకుత్‌పురా రైల్వేస్టేషన్‌, ఎస్‌ఆర్టీ కాలనీ, బడాబజార్‌, రెయిన్‌బజార్‌ చమన్‌, ఈస్ట్‌ చంద్రానగర్‌, మౌలా కా చీల్లా, ముర్తుజా నగర్‌ తదితర ప్రాంతాల్లో నాయకులు, జీహెచ్‌ఎంసీ మాన్‌సూన్‌ సిబ్బందితో కలిసి పర్యటించారు. రోడ్లపై నిలిచిన వరద నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్‌: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాతంరాయిలో నివాసముంటున్న నాగరాజు (40) ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురై 4,5 రోజులుగా ఇంటి వద్దే ఉంటూ మద్యం తాగుతూ గడుపుతున్నాడు. ఈ నెల 21న భార్య దివ్యతో పాటు పిల్లలను సమీపంలోనే ఉన్న అత్తవారి ఇంటి వద్ద వదిలేసి ఇంటి వచ్చాడు. ఆదివారం ఉదయం నుంచి ఫోన్‌ తీయకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

త్వరలోనే నాలుగు లేన్ల రహదారి పనులు

- జీఎంఆర్‌ స్కూల్‌ నుంచి రైల్వేగేటు వరకు
- నాలుగు కిలోమీటర్ల రహదారి వెడల్పు
- సింగిల్‌ రోడ్డును 4లైన్ల రోడ్డుగా మార్చే దిశగా అడుగులు
- త్వరలో రాకపోకలకు సౌలభ్యం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



రహదారి విస్తరణ పనులకు మార్కింగ్‌లు వేస్తున్న ఇంజనీరింగ్‌ అధికారులు

శంషాబాద్‌: శంషాబాద్‌ పట్టణం నుంచి మామిడిపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి వెడల్పు పనులు అతి త్వరలోనే ప్రారంభం కానుంది. ప్రస్తుతం సింగిల్‌ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని నాలుగులేన్ల రహదారిగా మార్చేందుకు ఆర్‌అండ్‌బీ సిద్ధమైంది. ఇప్పటికే మామిడిపల్లి చౌరస్తా నుంచి జీఎంఆర్‌ స్కూల్‌ మలుపు వరకు రహదారిని వెడల్పు చేసి అందుబాటులోకి తీసుకొచ్చి ఆరునెలలు దాటింది. జీఎంఆర్‌ స్కూల్‌ మలుపు నుంచి శంషాబాద్‌ పట్టణం వరకు మాత్రం రహదారి సింగిల్‌ రోడ్డుగానే ఉండడంతో దీనికి సంబంధించిన ప్రక్రియను కూడా ఆర్‌అండ్‌బీ పూర్తి చేసింది. గత 4 రోజులుగా రోడ్డు వెడల్పుకు సంబంధించిన మార్కింగ్‌ పనులను ఇంజనీరింగ్‌ అధికారులు వేగంగా చేపడుతున్నారు. మరో 10రోజుల్లోపే రహదారి విస్తరణ పనులు పూర్తి స్థాయిలో ప్రారభించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఇక రయ్‌..రయ్‌..

శంషాబాద్‌ పట్టణం వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పూర్తయితే ప్రయాణ సౌలభ్యం పెరుగుతుంది. మామిడిపల్లితోపాటు శ్రీశైలం రహదారి, మైలార్‌దేవ్‌పల్లి వైపు వెళ్లే ప్రయాణికులకు ఈ రహదారి సౌలభ్యంగా మారుతుంది. దీంతో జాతీయ రహదారి నుంచి నగరం వైపు వెళ్లే ట్రాఫిక్‌ను కొంతమేరకు తగ్గించేందుకు అవకాశముంది. అదే విధంగా మామిడిపల్లి వైపు ఉన్న ఇమిగ్రేషన్‌ బ్యూరో కార్యాలయం, విమానాశ్రయం కార్గో సంబంధిత ప్రాంతాలకు రాకపోకలకు కూడా సౌలభ్యంగా మారుతుందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్‌ఘాతానికి మూగ జీవి బలి



మైలార్‌దేవ్‌పల్లి: ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలి మూగ జీవులు బలవుతున్న పట్టించుకోని విద్యుత్‌ అధికారులు. డివిజన్‌ బ్రుంధావన్‌ కాలనీకి చెందిన గౌరిగే రాజేష్‌ అనే వ్యక్తికి చెందిన ఆవు ఆదివారం కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రక్కన నుండి వెళ్లే సమయంలో విద్యుత్‌ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ పార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం అయ్యారని, దీంతో మూగజీవి ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో స్థానిక ప్రజలు విద్యుత్‌ అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోలేదన్నారు. రోడ్డు ప్రక్కన ఏర్పాటు చేసిన విద్యుత్‌ ట్రాన్స్‌ పార్మర్‌ తక్కువ ఎత్తులో ఉండడం వలన పశువులకే కాదు మనుషులకు కూడా ప్రమాదకరంగా ఉందని వాపోతున్నారు. పశువులు చనిపోయినా పట్టించుకోని అధికారులు మనుషులు చనిపోయిన తరువాత ట్రాన్స్‌ఫార్మర్‌ ఎత్తు పెంచి కంచె వేస్తారా అంటూ స్థానికులు విద్యుత్‌ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఘటనలో మరో జీవి చనిపోక ముందే ట్రాన్స్‌ పార్మర్‌ చుట్టూ కంచెను లేదా ట్రాన్స్‌ఫార్మర్‌ ఎత్తును పెంచాలని అధికారులను స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి 28 వరకు మెగా లోక్‌ అదాలత్‌

గచ్చిబౌలి: మెగా లోక్‌ అదాలత్‌ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు ఈ మెగా లోక్‌ అదాలత్‌ నిర్వహిస్తారు. ఈ లోక్‌ అదాలత్‌లో డ్రంకన్‌ డ్రైవ్‌ కేసు, డ్రైవింగ్‌ లైసెన్స్‌ కేసు క్లియర్‌ చేసుకోవాలని గచ్చిబౌలి ట్రాఫిక్‌ పోలీసులు కోరుతున్నారు. డాక్యుమెంట్లు రెండు సెట్ల ఆధార్‌ జిరాక్స్‌ పత్రాలు సమర్పించి కేసు కోసం హాజరై పరిష్కరించుకోవాలని వారు సూచించారు. మరిన్ని వివరాలకు కోర్టు పీసీ బాబురావు ఫోన్‌ నెంబర్‌ 9676765480లో సంప్రదించాలి.

నేడు చలో లేబర్‌ కమిషనర్‌ ఆఫీస్‌

గోల్కొండ: భవన నిర్మాణ కార్మికులకు కార్డు ద్వారా ఇచ్చే లేబర్‌ ఇన్సూరెన్స్‌ బెనిఫిట్స్‌ను ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పడం సరికాదని సీఐటీయూ నాంపల్లిజోన్‌ కార్యదర్శి సి.మల్లేష్‌ అన్నారు. ఆదివారం టోలిచౌకీ, గుడిమల్కాపూర్‌ తదితర ప్రాంతాల్లోని లేబర్‌ అడ్డాల వద్ద నేడు జరిగే చలో లేబర్‌ కమిషనర్‌ కార్యాలయం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్‌ ఇన్సూరెన్స్‌ బెనిఫిట్స్‌ను కార్మిక వెల్ఫేర్‌ బోర్డు పరిధిలోనే ఉంచాలన్నారు. ప్రైవేటు ఇన్సూరెన్స్‌ కంపెనీలకు అప్పజెప్పడం వల్ల అవినీతి చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. దీన్ని కోసం నేడు జరిగే చలో లేబర్‌ కమిషనర్‌ ఆఫీస్‌ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణ, రాములు, వీరేశం, నాగరాజు, నర్సింహారెడ్డి తదితరులున్నారు.

'మనూ'లో విద్యార్థులు అంతరాయం కల్పిస్తే ఆన్‌లైన్‌ బోధన

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిస్థితిని సమీక్షించడానికి యూనివర్సిటీ ఉన్నతాధికారులతో వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ సమావేశమయ్యారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యంగా విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోళనలు చేస్తే అందుకు తగిన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారు. క్యాంపస్‌లో చక్కటి వాతావరణానికి అంతరాయం కల్పిస్తే క్యాంపస్‌లోని వసతి గృహాలను మూసి వేసి, విద్యార్థులు వాటిని ఖాళీ చేయించాల్సి వస్తుందని వారు స్పష్టం చేశారు. మిగిలిన సెమిస్టర్‌ తరగతులను ఎవరికీ ఇబ్బంది కలుగకుండా తరగతులను ఆన్‌లైన్‌ ద్వారా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. కొందరు కావాలని తరగతులు జరుగకుండా అంతరాయం కల్పిస్తున్నారని దీన్ని ఎంత మాత్రం సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీకి తమ సమస్యలను వివరించేందుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇలాంటిది కాదంటూ అశాంతి వాతావరణం సృష్టించేందుకు ఎవరైనా చేస్తే సహించమన్నారు.

'హానర్‌ వివాంటీస్‌'కు ఔత్సాహిక సొసైటీ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న హానర్‌ వివాంటీస్‌ సొసైటీ ప్రతినిధులు

రాయదుర్గం: ఇటీవల నిర్వహించిన గణేష్‌ ఉత్సవాల్లో గోపన్‌పల్లిలోని హానర్‌ వివాంటీస్‌ కమ్యూనిటీ అసోసియేషన్‌కు 'మోస్ట్‌ ఎంతూజియాస్టిక్‌ సొసైటీ'అవార్డు దక్కింది. గణేష్‌ ఉత్సవ సమితి-2024లో భాగంగా కమ్యూనిటీ పర్యావరణ అనుకూల గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, వివిధ రకాల మహా ప్రసాద వితరణ, భక్తి శ్రద్ధలతో వినాయకుడికి వీడ్కోలు పలకడం వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని గ్రేట్‌ గణేష్‌ అవార్డు-2024 సీజన్‌-5 తెలంగాణ ప్రభుత్వ సమన్వయంతో లయన్స్‌క్లబ్‌ ఇంటర్నేషనల్‌, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఈ అవార్డులను అందించారు. హనర్‌ వివాంటీస్‌ కమ్యూనిటీ అసోసియేషన్‌ నుంచి శ్రీనివాస్‌బాల, రాహుల్‌ వెంకట్‌, వెంటక్‌ అంబటి, పూజాత్యాగి అవార్డును స్వీకరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ

గోల్కొండ: భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తూ సేవా కార్యక్రమాన్ని చేపడుతున్నామని బీజేపీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్‌లో సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు ఆయన నిత్యావసరాలు పంపిణీ చేశారు. పేదలను ఆదుకోవడంలో బీజేపీకి మరేపార్టీ సాటిరాదన్నారు. భారీ వర్షాలకు ఈ సంవత్సరం తెలంగాణ రైతులు ఎంతో నష్టపోయారని వారి కన్నీటి గాధలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్‌, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్‌, బీజేపీ కిసాన్‌ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షులు రావుల మాణిక్‌ప్రభు, అన్నాయాదవ్‌, రాజేందర్‌ డిగాన్‌, తదితరులున్నారు.

రసాభాసగా ముగిసిన ఎన్నిక



లంగర్‌హౌస్‌: లంగర్‌హౌస్‌ దసరా ఉత్సవ సమితి నూతన కమిటీ ఎన్నిక రసాభాసగా సాగింది. దీంతో పెద్దలు ప్రస్తుతం ఎన్నిక వాయిదా వేశారు. వివరాల్లోకి వెళితే..దసరా సందర్భంగా గోల్కొండ కోట వద్ద, లంగర్‌హౌస్‌ రాంలీలా మైదానంలో పెద్దయెత్తున దసరా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితి. చుట్టు పక్కల మండలాలలో ఉండే గ్రామాల ప్రజలు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొనే వారు. 2024 సంవత్సరానికి సంబంధించి ఈ సంవత్సరం కూడా వేడుకల నిర్వహణ ఎస్సీ వర్గానికి చెందిన అధ్యక్షుడితోనే చేయాలని పెద్దలు నిర్ణయించారు. ఆదివారం సంగం రాంలీలా మైదానంలో ఎన్నిక నిర్వహించేందుకు పెద్దలతో పాటు వివిధ బస్తీల వాసులు పాల్గొన్నారు. అధ్యక్ష పదవి ఏకగ్రీవం చేసే ప్రయత్నం చేయగా చిన్నాన్న, పెద్దనాన్న కుమారులు పోటీపడ్డారు. ఒకే కుటుంబం వారు కావడంతో సంధి కుదిర్చే ప్రయత్నం చేశారు. చివరకు ఎన్నిక లేదా చీటి వేసి డ్రా తీయడానికి ప్రయత్నించగా ఏకాభిప్రాయం కుదరక రసాభాసగా మారింది. దీంతో రెండు రోజుల తర్వాత ఎన్నిక నిర్వహిస్తామని, అంతలో మీరు ఏకాభిప్రాయానికి రావుంటే తమ నిర్ణయమే చివరిదని పెద్దలు చెప్పి సమావేశాన్ని వాయిదావేశారు.

భారీ వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకుంటాం



టోలిచౌకి టూమ్బ్స్‌ రోడ్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: భారీ వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకుంటామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్‌ నియోజకవర్గంలోని కార్వాన్‌, టోలిచౌకీ, నానల్‌నగర్‌, గోల్కొండ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, వరద నీటితో నిండుగా ఉన్న నాలాలు, చెరువులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. శాతం చెరువు భారీ వర్షాలకు పూర్తిగా నిండిందని దీన్ని వల్ల నదీమ్‌ కాలనీ లోతట్టు ప్రాంతాల వారికి నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. చెరువు తూముకు మరమ్మతులు చేసి నీటిని భారీగా వదులుతున్నామన్నారు. అదే విధంగా టొలిచౌకీ చౌరస్తాలో వర్షం కురిసిన ప్రతిసారి వ్యాపార సముదాయాలతో పాటు భవనాల సెల్లార్‌లలో వరద నీరు చేరుతుందని ఆయన అన్నారు. దీన్ని నివారించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించేలా బల్దియా కమిషనర్‌తో పాటు అధికారులను కోరడం జరిగిందన్నారు. టోలిచౌకీ చౌరస్తా, ఎండి లైన్స్‌, నానల్‌నగర్‌ మెయిన్‌ రోడ్డు, సాలార్‌జంగ్‌ కాలనీ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు వరద నీటికి బాగా దెబ్బతిన్నాయన్నారు.

మున్సిపాలిటీకి అందని విలీన గ్రామాల రికార్డులు



శంషాబాద్‌ మున్సిపాలిటీ కార్యాలయం

శంషాబాద్‌: మున్సిపాలిటీలో సమీప గ్రామాలు విలీనం చేస్తూ ప్రభుత్వ అధికారికంగా ఆర్డినెన్స్‌ జారీ చేసి పక్షం రోజులు దాటినప్పటికీ అధికారికంగా సంబంధిత గ్రామాల విలీన ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఆయా గ్రామపంచాయతీల రికార్డులు ఇంకా మున్సిపల్‌ అధికారులకు చేరలేదు. శంషాబాద్‌ మున్సిపాలిటీలో ఇటీవల బహదూర్‌గూడ, పెద్దగొల్కొండ, చిన్నగొల్కొండ, హమీదుల్లానగర్‌, రషీద్‌గూడ, ఘాన్సిమియాగూడ పంచాయతీలను విలీనం చేశారు. దీనిపై కొన్నిగ్రామపంచాయతీ ప్రజలు తమ గ్రామాలను అసంబద్ధంగా విలీనం చేశారని నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. మరికొన్ని గ్రామాలకు చెందిన కొందరు మాజీ ప్రతినిధులు విలీనాన్ని వ్యతిరేకిస్తూ వేర్వేరుగా హై కోర్టులో రెండు పిటిషన్లు కూడా దాఖలు చేశారు. విలీనం సంబంధిత ప్రక్రియ ప్రభుత్వం కౌంటర్‌ దాఖలు చేయాల్సిందిగా ఇటీవల కోర్టు కూడా సూచించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం అధికారిక ఉత్తుర్వులు జారీ చేసినప్పటికీ రికార్డుల స్వాధీనం పరిపాలన ప్రక్రియను ఇంకా మున్సిపాలిటీలకు అప్పగించే విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు అందకపోవడంతో మున్సిపాలిటీ అధికారులు సైతం విలీన గ్రామాలకు సంబంధించిన తదుపరి ప్రక్రియలపై సర్కారు ఆదేశాల కోసం వేచి చూస్తున్నారు.

పేదల సమస్యలు తీర్చండి



వైఎస్సార్‌ కాలనీలో రోడ్ల దుస్థితిని చూపుతున్న నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని నెమలినగర్‌(వైఎస్సార్‌ కాలనీ)లో వందలాది మందికి అప్పటి దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎస్‌ఎస్‌ఆర్‌ఎంయూ గృహాలు ఇవ్వటంతో 100 కుటుంబాలు స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. పేదలు నివసిస్తున్న కాలనీల్లో తాగునీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఇదే విషయాన్ని ప్రశ్నిస్తే ఒక్క కనెక్షన్‌ ఇచ్చి చేతులు దులుపుకున్నారని సీపీఎం పార్టీ మండల కన్వీనర్‌ రుద్రకుమార్‌ ఆరోపించారు. ఆదివారం కాలనీలో పర్యటించిన వారు అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్ల మరమ్మత్తులు, ప్రతి బ్లాక్‌కు నీటి కనెక్షన్‌లను ఇవ్వటంతో పాటు ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించాలని రుద్రకుమార్‌ డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రవీణ్‌కుమార్‌, అశోక్‌, సావిత్రి, శివాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు



సమ్మేళనంను ప్రారంభిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్‌ తెలంగాణ విశ్వవిద్యాలయంలో పరిధిలోని రాజేంద్రనగర్‌, మోజర్ల కళాశాలల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 2007 నుంచి 2020 వరకు ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ అండర్‌ గ్రాడ్యుయేట్‌ పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌, పీహెచ్‌డీ విద్యార్థులందరూ పెద్ద మొత్తంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులను ఉద్దేశించి విశ్వవిద్యాలయం డీన్‌ ఆఫ్‌ స్టూడెంట్‌ డాక్టర్‌ విజయ్‌ మాట్లాడుతూ.. ఈ యూనివర్సిటీలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చి విద్యార్థులు విద్యను అభ్యసించి నేడు ఉన్నత స్థాయిలో ఉండటం అభినందనీయమన్నారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో బోధనతో పాటు విద్యార్థులకు అవసరమైన సివిల్స్‌, రాష్ట్రా స్థాయిలో నిర్వహించే గ్రూప్స్‌కు, బ్యాంకింగ్‌ జాబ్స్‌కు వివిధ ఉద్యోగాలకు శిక్షణ ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పిడిగం సైదయ్య, కళాధర్‌బాబు, షహనాజ్‌, నిరోషా, అశ్వన్‌ కుమార్‌, పిఎస్‌ఆర్‌ సంతోషిని, విద్య, శ్రీనివాసులు, ఉద్యాన అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని శివరాంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 1999-2000 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తమకు పాఠశాల చెప్పిన ఉపాధ్యాయులు సురేందర్‌ రెడ్డి, కృపాకర్‌ రెడ్డి, రామ్‌నాథ్‌ రెడ్డి, నాగయ్య, అరుణ, నరసింహాచారి, కిషన్‌, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌ పడమటి శ్రీధర్‌ రెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొడ్డు నరేశ్‌, రఘువీర్‌, శ్రీరాములు, మహేశ్‌, రాజు, సంతోష్‌, మాధవి, అర్చన, స్వాతి, సుమలత, మమత తదితరులు పాల్గొన్నారు.



దంచికొట్టిన వాన.. జలమయమైన లోతట్టు ప్రాంతాలు

- గంటన్నరపాటు ఉరుములు, మెరుపులతో వాన
- పలు కాలనీలలోని ఇళ్లలోకి చేరిన వరదనీరు
- విరిగిపడ్డ చెట్లు, నేలకొరిగిన విద్యుత్‌ స్తంభాలు



భారీ వర్షానికి ఇళ్లలోకి చేరిన వరదనీరు

బండ్లగూడ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. బండ్లగూడ జాగీర్‌, కిస్మత్‌పూర్‌, హైదర్శాకోట్‌, పీరం చెరువు, దర్గాఖలీజ్‌ఖాన్‌, గంధంగూడ, హిమాయత్‌సాగర్‌ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై వరద ఏరులై పారింది. లోతట్టు ప్రాంతాలు వినాయకనగర్‌, మెడిసిటీ కాలనీ, సంఘంసిటీలోని పలు కాలనీలలోని ఇళ్లలోకి రాత్రి సమయంలో వరదనీరు వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదర్శాకోట్‌లోని భాగ్యనగర్‌ కాలనీలో చెట్లు నేలకొరిగాయి. పలు చోట్ల విద్యుత్‌ స్తంభాలు విరిగిపడటంతో గంటల తరబడి విద్యుత్‌ అంతరాయం ఏర్పడింది. నాయకులు ప్రేమ్‌కుమార్‌గౌడ్‌, సురేష్‌గౌడ్‌, టింకురెడ్డి మున్సిపల్‌ శానిటేషన్‌ ఇన్స్‌పెక్టర్‌ నరేష్‌, ఏఈ శ్రీనివాస్‌ సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.



విరిగిపడిన విద్యుత్‌ స్తంభానికి వైర్‌లను సరిచేస్తున్న సిబ్బంది



విరిగిన చెట్లను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది